క్లుప్తంగా

జాతీయ మలేరియా మాసోత్సవ ర్యాలీ



గుంటూరు మెడికల్: జాతీయ మలేరియా మాసోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక శ్రీనివాసరావు తోట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన సదస్సు, ర్యాలీ జరిగాయి. మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఓ. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ దోమ కాటు ద్వారా మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా, ఇతర వ్యాధులు సోకుతాయన్నారు. జూన్‌లో దోమల వ్యాప్తి పెరిగే అవకాశాలు ఉన్న నేపథ్యంలో దోమలు పెరగకుండా ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ సందీప్ మాట్లాడుతూ దోమల నియంత్రణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సూపర్‌వైజర్లు కె.ఎన్. సుకుమార్, ఎస్.పి.ఎస్.సూరి, శ్రీనివాస రావు, హెల్త్ అసిస్టెంట్లు బి.శ్రీనివాసరావు షేక్. ఇలియాజ్, షేక్. జిలాని, బి.ఆనంద్ షేక్.మౌలాలి, షేక్ నజీర్, యూపీహెచ్‌సీ వైద్య సిబ్బంది ,సచివాలయ ఏఎన్ఎంలు, ఆషాలు, మున్సిపల్ కార్మిక సిబ్బంది పాల్గొన్నారు.

రవాణ శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు

పట్నంబజారు: రవాణ శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థల బస్సుల తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా నిబంధనలు పాటించని ఆరు బస్సులపై కేసులు నమోదు చేశారు. ఈసందర్భంగా డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు. విద్యా సంస్థలు ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని సర్టిఫికెట్లు కలిగి ఉండాలని, బస్సులో పూర్తిస్థాయి సామగ్రి ఉండాలన్నారు.

మహిళ అదృశ్యం

గుంటూరు ఈస్ట్ : మహిళ కనిపించకుండా పోయిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కన్నావారితోటలో నివశించే ఓ కుటుంబానికి చెందిన 23 సంవత్సరాల మహిళ ఈనెల 16వ తేదీ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం వెతికి కుటుంబ సభ్యులు కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శ్రీనివాసరావు తోటలో...

శ్రీనివాసరావుతోటలో నివశించే ఓ కుటుంబానికి చెందిన 20 సంవత్సరాల మహిళ ఈనెల 14వ తేదీ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం వెతికి కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒకరి బదులు మరొకరు పరీక్ష రాసినందుకు...

గుంటూరు ఈస్ట్: ఒకరి బదులు మరొకరు పరీక్ష రాస్తున్న ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌హెచ్‌ఓ రాజశేఖరరెడ్డి కథనం ప్రకారం అశోక్‌నగర్‌లోని ఓ హోటల్‌లో జీఆర్ఈ, టోఫెల్ పరీక్షలు ఒకరికి బదులు మరొకరు ఆన్‌లైన్‌లో రాయిస్తున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం దాడి చేశారు. హోటల్ గదిలో ఉన్న డి.సచిన్, కె.వెంకట అశ్వంత్, జి.సందీప్, కె.అవినాష్, గౌరీ హర్షలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. విదేశాలకు వెళ్లదలిచిన విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు తీసుకుని అడ్డదారిలో పాస్ చేయించేందుకు ప్రయత్నించినందుకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్టు



పట్నంబజారు: చెడు వ్యసనాలకు బానిసగా మారి చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కొత్తపేట పోలీసు స్టేషన్‌లో సోమవారం ఈస్ట్ సబ్ డివిజన్ ఏఎస్పీ నితికేష్ సలేకే, సీఐ అన్వర్ బాషా వివరాలు వెల్లడించారు. ప్రకాశం జిల్లా, కనిగిరి మండలం చాకిరాల మండలానికి చెందిన మల్లెల కొండారెడ్డి జల్సాలకు బానిసగా మారి చోరీలకు అలవాటు పడ్డాడు. విజయవాడ, గుంటూరు పరిధిలో 18 ద్విచక్ర వాహనాలు చోరీ చేయగా, సోమవారం మాయాబజారు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించడంతోపాటు చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడు. రూ. 11.60 లక్షల విలువ చేసే వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన ఎస్సై నీరజ్, ఏఎస్సై ఆంథోని, హెడ్‌కానిస్టేబుల్ ఎస్.రవి, కోటేశ్వరరావు, కానిస్టేబుల్‌ను అభినందించారు.

ఆశీలు పక్కదారి!

గుంటూరు నగరపాలక సంస్థ రెవెన్యూ వసూళ్లు ప్రైవేటు దారిపట్టేశాయి. పర్యవేక్షించాల్సిన యంత్రాంగం మీన–మేషాలు లెక్కిస్తోంది. ప్రైవేటు వ్యక్తులకు వెన్నుదన్నుగా ఉండి వసూళ్ల పర్వానికి ఊతమై నిలుస్తున్నారన్న విమర్శలు నగరంలో పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. కార్పొరేషన్ ఆదాయ వనరుల్లో ఒకటైన ఆశీలు.. ఇవాళ ఈ వ్యక్తుల ఫ్యాంటు–చొక్కా జేబులను పబ్లిగ్గా నింపేస్తోంది. వీళ్ల నిర్వాకానికి అడ్డుకట్టవేసే వారు లేకపోవడంతో కార్పొరేషన్ చెంతనే నిర్విరామంగా ఈ వసూలు తంతు సాగిపోతోంది.

- నగరపాలక సంస్థ అధికారుల మీన–మేషాలు
- ప్రైవేట్ వ్యక్తులతో వసూళ్లు
- నగదు లేకుండా రశీదులు అచ్చు!
- జేబులు నింపుకుంటున్న వైనం



పీవీకే నాయుడు మార్కెట్ వద్ద చిరు వ్యాపారుల నుంచి ఆశీలు వసూలు చేస్తున్న ప్రైవేట్ వ్యక్తులు



నగదు, నగరపాలక సంస్థ స్టాంప్ లేకుండా ఉన్న రశీదు

నెహ్రూనగర్ (గుంటూరు తూర్పు): నగరపాలక సంస్థకు ఆదాయం సమకూర్చేది రెవెన్యూ విభాగమే. ఇంతటి విభాగానికి ప్రధానం ఆదాయమే. అలా వస్తున్న ఆదాయమే దర్జాగా పక్కదారి పడుతోంది. దీనిని అరికట్టాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రైవేట్ వ్యక్తుల జేబుల్లోకి కార్పొరేషన్ ఆదాయం వెళ్లిపోతోంది. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని మార్కెట్లు, మరుగుదొడ్ల నిర్వహణకు సంబంధించి ఆశీలు వసూలు చేసేందుకు డిపార్ట్‌మెంట్ (నగరపాలక సంస్థ సిబ్బంది ద్వారా) కలెక్షన్స్ చేయాల్సి ఉంది. కానీ ఇందుకు విరుద్ధంగా ప్రయివేట్ వ్యక్తులు కలెక్షన్ చేసుకుని వచ్చిన దానిలో సగం తమ జేబుల్లో ఉంచుకుని మిగిలింది అధికారులకు అందజేయడం పరిపాటిగా మారింది.

మార్కెట్, దొడ్లు ఆశీలు వసూలు ఇలా...!

మార్కెట్లు, మరుగుదొడ్ల ఆశీలు వసూలు చేసేందుకు ఆర్ఐలు, సంబంధిత వార్డు అడ్మిన్ సెక్రటరీలకు బాధ్యతలు అప్పగించారు. కాని దీనిని కాదని అధికారులు, ప్రయివేట్ వ్యక్తులు కుమ్మక్కై భారీ మొత్తంలో దోచుకుంటున్నారని తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. ఆశీలు వసూలు పరిశీలిస్తే..

పీవీకే నాయుడు మార్కెట్ లోపల కూరగాయాలు, వెలుపల గల ఆకుకూరల వారి నుంచి రుసుము రోజుకు 13,244 వసూలు చేయాలి. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న కొల్లిశారద హోల్ సేల్ కూరగాయాల మార్కెట్ నుంచి రోజుకు రూ.24,893 వసూలు చేయాలని ఉత్తర్వులున్నాయి. లాలాపేట ఎగుమతులు, దిగుమతులు సంబ్రీస్ మార్కెట్ వద్ద రోజుల్లో వేలల్లో వచ్చే నగదు తమ జేబుల్లోకి వేసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. నగరంలో వివిధ ప్రాంతాల్లో ఎనిమిది చోట్ల ఉన్న మరుగుదొడ్ల నుంచి రోజుకు రూ.13,146 వసూలు చేయాలని కమిషనర్ ఉత్తర్వులు ఉన్నాయి. కానీ వీటిలో సగానికి సగం ప్రయివేట్ వ్యక్తుల జేబుల్లోకి వెళ్లిపోతుండటం విశేషం. మార్కెట్లు, మరుగుదొడ్ల నిర్వహణకు సంబంధించి ఓపెన్ ఆక్షన్ (వేలం పాట) పెడితే కార్పొరేషన్‌కు కోట్లల్లో ఆదాయం సమకూరుతుంది. ఆ విధంగా కాకుండా కొంత మంది స్వార్థం కోసం వేలం పాట నిర్వహించకుండా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు.

నగదు రహిత రశీదులు!!

మార్కెట్ల వద్ద వ్యాపారస్తుల నుంచి ఆశీలు వసూలు చేసేందుకు నగరపాలక సంస్థ నుంచి ఇచ్చే రశీదుపై కేటాయించిన నగదు ముద్రించి ఉండాలి. కాని సదరు రశీదుపై ఎటువంటి నగదు ముద్ర లేకపోవడంతో పాటు నగరపాలక సంస్థకు సంబంధించిన స్టాంప్ కూడా లేదు. దీంతో సదరు ప్రయివేట్ వ్యక్తులు తమ ఇష్టానుసారంగా చిరు వ్యాపారుల నుంచి నగదు వసూలు చేసుకుంటున్నారు. రోజు పెట్టే చిరు వ్యాపారుల వద్ద రోజుకు రూ.30, అదే విధంగా సీజనల్‌గా వ్యాపారం చేసుకునే వారు (ఈత పండ్లు, తాటి ముంజలు అమ్ముకునే) వద్ద నుంచి రూ.50 నుంచి 100, అదే విధంగా రాత్రి వేళల్లో, తెల్లవారుజామున ఆకుకూరలు అమ్మే వ్యాపారుల నుంచి రూ.20 నుంచి రూ.30 వరకు వసూలు చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

సంబ్రీస్ మార్కెట్ ఆక్షన్ పెట్టడంపై మీనమేషాలు

మార్చి 31వ తేదీతో సంబ్రీస్ మార్కెట్ ఆశీలు వసూలు గడువు ముగియడంతో ప్రస్తుతం ఆశీలు వసూలు నిలిపివేశారు. ప్రస్తుతం సంబ్రీస్ మార్కెట్‌కు బహిరంగ వేలం పాట నిర్వహిస్తే దాదాపు రూ.3 కోట్లు దాకా ఆదాయం వచ్చేది. కొన్ని అనివార్య కారణాల సంబ్రీస్ మార్కెట్ వేలం పాట ప్రక్రియ పెట్టకపోవడం వలన రోజుకు లక్ష చొప్పున నష్టపోతోంది. వెండింగ్ జోన్స్ ఏర్పాటు చేసి నెల వారీ వసూలు చేసే కార్యచరణను పట్టించు కోకపోవడంతో మూడు నెలలకు దాదాపు 90 లక్షలు దాకా కార్పొరేషన్‌కు నష్టం వాటిల్లినట్లయింది.

డిమాండ్ ప్రకారం ఆశీలు వసూలు చేస్తాం

డిపార్ట్‌మెంట్ కలెక్షన్స్ వసూలు చేసేందుకు ఇచ్చిన ఆశీలు డిమాండ్ ప్రకారం ప్రతి రోజూ వసూలు చేసి సంబంధిత అధికారులు నగరపాలక సంస్థకు జమ చేయాల్సిందే. ఎక్కడైనా అవకతవకలు జరిగితే చర్యలు తీసుకుంటాం. ప్రైవేట్ వ్యక్తులు ఆశీలు వసూలు చేస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. వీలైనంత త్వరలో సంబ్రీస్ మార్కెట్, మార్కెట్లు, మరుగుదొడ్ల నిర్వహణకు సంబంధించి వేలం పాట నిర్వహిస్తాం.

– పెద్ది రోజా, అదనపు కమిషనర్

మెరుగైన సౌకర్యాలు కల్పించండి



పట్నంబజార్: భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత పాలక మండలి సభ్యులపై ఉందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. సోమవారం పట్నంబజారులోని శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నూతన పాలక వర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ముందుగా ఎమ్మెల్యే ముస్తఫా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాలక మండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ పదవులు ప్రతి ఒక్కరిపై బాధ్యత పెంచుతుందన్నారు. పాలక మండలి సభ్యులుగా నిడమానూరి సురేష్, మారుతి, సుబ్బారావు, ఇందుమతి, సురేష్, రమాదేవి, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ మహిళ నేత నూరి ఫాతిమా, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

కేంద్ర నిర్ణయంతో అన్యాయమే

నెహ్రూనగర్: విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు పూనుకోవడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తీరని ద్రోహం చేసినట్లేనని ఎంసీపీఐయూ గుంటూరు జిల్లా కార్యదర్శి అమర్తలూరి వెంకటేశ్వరరావు మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం నగరంపాలెంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గత 858 రోజులుగా విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలని ఉద్యమలు చేస్తున్న కేంద్ర ప్రభు త్వం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకే మొగ్గుచూపటం ఏపీ పట్ల కేంద్ర వైఖరిని స్పష్టం చేస్తుందన్నారు.

సమస్య పునరావృతం కాకూడదు

- శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలి
- సిబ్బందిని ఆదేశించిన కమిషనర్ కీర్తి చేకూరి
- స్పందన కార్యక్రమానికి 29 ఫిర్యాదులు



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: జగనన్నకు చెబుదాం, స్పందనకు అందే ఫిర్యాదులను విభాగాధిపతులే నేరుగా పరిశీలించి పరిష్కరించాలని, ఏ ఒక్క ఫిర్యాదు పునరావృతం కాకుండా శాశ్వత ప్రాతిపదికన పరిష్కారానికి కృషి చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో స్పందన నిర్వహించారు. కమిషనర్ తొలుత జగనన్నకు చెబుదాం, స్పందన పోర్టల్, ఈఆర్‌పీ, వాట్సాప్, కాల్ సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదులపై అధికారులతో, సంబంధిత సిబ్బందితో సమీక్షించి ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

రాష్ట్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు!

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నుండి జగనన్నకు చెబుదాంకు అందే ఫిర్యాదుల పరిష్కారం పట్ల నేరుగా రాష్ట్రస్థాయి అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారని, ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించాలన్నారు. అలాగే జగనన్న సురక్ష కార్యక్రమం యాక్షన్ ప్లాన్ సచివాలయాల వారిగా సిద్ధం చేసుకోవాలన్నారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారిగా జగనన్నకు చెబుదాం అర్జీలపై ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియచేయాలన్నారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలు జత చేయాలన్నారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారీగా తమ సచివాలయం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలన్నారు.

విభాగాధిపతులతో సమీక్షించండి

స్పందన అర్జీల అప్ డేట్స్‌ని ప్రత్యేకంగా విభాగాధిపతులతో ఏర్పాటు చేసిన గ్రూప్‌లో పోస్ట్ చేసి, పరిష్కారాలపై సమీక్ష చేయాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు. ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులు అందరూ వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉండాలన్నారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 29 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 11, ఇంజినీరింగ్ విభాగానికి 8, రెవెన్యూ విభాగానికి 3, ప్రజారోగ్య విభాగానికి 4, ఉపాసెల్ విభాగానికి 2, పరిపాలన విభాగానికి 1 చొప్పున ఫిర్యాదు అందాయని, ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాస రావు, ఉపా సెల్ పీఓ రవీంద్ర, ఎస్ఈ భాస్కర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ భానుప్రకాష్, ఏడీహెచ్ రామారావు, బయాలజిస్ట్ మధుసూదన్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఏసీపీలు, ఈఈలు, ఎస్ఎస్‌లు, సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గుంటూరులో భాగస్వాములు కావాలి

- ప్రతి ఒక్కరు సహకరించాలి
- మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు



యంత్రాలను ప్రారంభిస్తున్న మేయర్ కావటి, కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: స్వచ్ఛ గుంటూరు సాధనలో నగర పాలక సంస్థకు ప్రతి ఒక్కరు సహకరించి భాగస్వాములు కావాలని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. సోమవారం నేషనల్ సఫాయి కర్మచారి ఫైనాన్స్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సహకారంతో నగరంలోని ర్యాక్ పిక్కర్స్ కు పారిశుద్ధ్య నిర్వహణకై అందించిన యంత్రాలను నగర కమిషనర్ కీర్తి చేకూరితో కలిసి నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగర సుందరీకరణకు, స్వచ్ఛ నగరంగా మార్చుకునేందుకు నగరపాలక సంస్థ కృషి చేస్తోందని, ఇందులో నగర ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కోరారు. నేషనల్ సఫాయి కర్మచారి ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారు నగరంలోని ర్యాక్ పిక్కర్స్‌కి 8 యూజీడీ పైప్ లైన్ క్లీనింగ్ రాటింగ్ మెషిన్స్, 2 జేసిబిలు, 5 నాలా క్లీనింగ్ మెషిన్స్, 2 సక్షన్ కం జెట్టింగ్ మెషిన్స్, 2 సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ మిషన్స్‌ని సబ్సిడీ ద్వారా అందించారన్నారు. సదరు పారిశుద్ధ్య నిర్వహణ యంత్రాలను గుంటూరు నగరపాలక సంస్థలో మెరుగైన పారిశుద్ధ్యం అందించడానికి వినియోగించడం ద్వారా ర్యాక్ పిక్కర్స్‌కు జీవనాధారం కల్పించినట్లౌతుందని తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో మెరుగైన పారిశుద్ధ్యం అందేలా ఇప్పటికే వార్డు సచివాలయాల వారీగా 220 ఈ–ఆటోలను రాష్ట్ర ప్రభుత్వం అందించిందని, ప్రస్తుతం ర్యాక్ పిక్కర్స్‌కి నేషనల్ సఫాయి కర్మచారి ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అందించిన యంత్రాల ద్వారా నగరంలో యుజీడీ లైన్లు, నాళాలు శుభ్రం చేయడం తేలిక అవుతుందన్నారు. జెసీబీల ద్వారా ప్రధాన కాలువలు ఎప్పటికప్పుడు పూడిక తీయడం జరుగుతుందన్నారు. సదరు యంత్రాలను ప్రజారోగ్య విభాగం, ఇంజినీరింగ్ విభాగాలు ప్రణాళికాబద్ధంగా వినియోగించడం ద్వారా పారిశుద్ధ్యంపై ప్రజల నుంచి అందే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించవచ్చునన్నారు. సదరు కార్యక్రమంలో కార్పొరేటర్ షేక్ మీరావలి, ఎస్ ఈ భాస్కర్ రావు, సీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, ఈ.ఈ కొండారెడ్డి, ఎస్ ఎస్ లు, డీ ఈ ఈ లు, ఏ ఈలు, ప్రజారోగ్యాదికారులు, ర్యాక్ పిక్కర్స్ పాల్గొన్నారు.

విద్యారంగంలో జగనన్న విప్లవాత్మక మార్పులు

- నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు
- విద్యా ఆణిముత్యాలుకు నగదు ప్రోత్సాహకాలు



విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న మేయర్ కావటి, ఎమ్మెల్యే ముస్తఫా


నెహ్రూనగర్: సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నారని తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. గుంటూరు నగరంలోని తూర్పు నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదివి అత్యధిక మార్కులు (మొదటి మూడు స్థానాలు) సాధించిన పానుగుపాటి శ్రీనివాసరావు, దేవరశెట్టి హేమ మణికంట, సర్వేపల్లి రాజేశ్వరి విద్యార్థులకు నగరంలోని 12వ డివిజన్ చౌత్ర సెంటర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాల కింద నగదు ప్రోత్సాహకాలు అందజేయడంతో పాటు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో విద్యారంగం అభివృద్ధికి సీఎం వై.ఎస్.జగన్ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లి నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఇటువంటి ప్రోత్సాహకాలు అందించడం ఎంతో అభినందించదగ్గ విషయమన్నారు. మేయర్ మాట్లాడుతూ చదువుకి పేదరికం, కులం అడ్డుకాదని, విద్యార్థులు చదువుకొనే సమయంలోనే లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యనభ్యసించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థ అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ షేక్ సజీల, గుంటూరు తూర్పు నియోజకవర్గ మహిళా నాయకురాలు షేక్ నూరి ఫాతిమా, కార్పొరేటర్లు ఖాజా మొహిద్దీన్ చిష్టి, సంకూరి శ్రీనివాసరావు, షేక్ మహమూద్, వేముల జ్యోతి పద్మజ శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

న్యాయ కళాశాలలు నాక్ గుర్తింపు సాధించాలి



గుంటూరు ఎడ్యుకేషన్: ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలలతో పాటు న్యాయ కళాశాలలు తప్పనిసరిగా నాక్ గుర్తింపు సాధించాలని బెంగుళూరులోని నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్ (నాక్) సహాయ సలహాదారులు డాక్టర్ ప్రియా నారాయణన్, డాక్టర్ ఏవీ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం జేకేసీ కళాశాల రోడ్డులోని జేసీ లా కళాశాలను సందర్శించిన నాక్ సభ్యులు నాక్ గుర్తింపుకు సంబంధించిన అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాక్ గుర్తింపు కోసం ఏ విధంగా సంసిద్ధం కావాలనే అంశాలపై అవగాహన కార్యక్రమానికి హాజరైన వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు వివరించారు. కార్యక్రమంలో జేసీ లా కళాశాల కార్యదర్శి వేమన కుప్పుస్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినేని సుధాకర్‌బాబు పాల్గొన్నారు.

ఎర్రబాలెంలో యువకుడి ఆత్మహత్య



గోపాల్ (ఫైల్)

మంగళగిరి: పాడుబడిన బావిలోకి దూకి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కార్పొరేషన్ పరిధి ఎర్రబాలెం రైస్‌మిల్ వీధిలో చోటు చేసుకుంది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఎర్రబాలేనికి చెందిన శిఖా శంకర రావు, రాజేశ్వరి దంపతుల మూడో కుమారుడు గోపాల్ (35)కు, గుంటూరుకు చెందిన అనూషకు పదేళ్ల కిందట వివాహమైంది. వీరికి సాయి, చరణ్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. గోపాల్ కొంతకాలం కిందట సెక్యూరిటీ గార్డుగా పని చేసినా, ప్రస్తుతం తాపీ పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వేసవి ఎండల నేపథ్యంలో కొన్ని రోజులుగా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఏం జరిగిందో తెలియదు గానీ గోపాల్ టవల్ కట్టుకుని ఇంట్లోంచి బయటకు వచ్చే క్రమంలో తండ్రి శంకరరావు అడ్డుకుని గేటు వేశాడు. అయినా గోపాల్ దాన్ని తొలగించి సమీపంలో ఉన్న ఓ పాడు బడిన బావిలోకి దూకేశాడు. కుటుంబ సభ్యులు బిగ్గరగా కేకలు వేయడంతో ఇరుగు పొరుగువారు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్నా ఎవరూ పాడు బడిన బావిలోకి దిగి గోపాల్‌ను కాపాడే సాహసం చేయలేకపోయారు. సమాచారం అందుకున్న మంగళగిరి రూరల్ ఎస్ఐ క్రాంతి కిరణ్, అగ్నిమాపక శాఖ అధికారి వెంకటేశ్వరరెడ్డి సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. బావి వినియోగంలో లేకపోవడంతో పాడుబడింది. నీరు సైతం పాచిపట్టి, తీవ్ర దుర్గంధం రావడంతో సిబ్బంది సైతం బావిలోకి దిగే సాహసం చేయలేకపోయా రు. తాడేపల్లి సీతానగరంలోని గజ ఈతగాళ్లను రంగంలోకి దించి గోపాల్ మృతదేహాన్ని బయటకు తీసేందుకు ప్రయత్నించినా చీకటి పడటంతో వీలుపడలేదు. మృతదేహం మంగళవారం ఉదయం నీటిపైకి తేలియాడే అవకాశం ఉందని, అప్పటి వరకూ ఏం చేయలేమని పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మృతుని కుటుంబ సభ్యులకు తెలిపారు.

చేనేత సమస్యలు పరిష్కరించాలి


నెహ్రూనగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతల సమస్యలు పరిష్కారించాలని చేనేత ఐక్య కార్యచరణ కమిటీ కన్వీనర్ వై.కోటేశ్వరరావు(వైకే) డిమాండ్ చేశారు. సోమవారం స్పందన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. నిలువ ఉన్న చేనేత వస్త్రాలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, చేనేతలకు 11 రకాల వస్త్రాల రిజర్వేషన్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, చేనేతలపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని పలు డిమాండ్లతో వినతి అందజేశారు.

వేద విద్యార్థులకు ప్రోత్సాహక పురస్కారాలు



గుంటూరు ఈస్ట్: కొత్తపేటలోని యడవల్లి ధర్మసత్రంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వేద పాఠశాల విద్యార్థులకు ప్రోత్సాహక పురస్కారాలు ప్రదానం చేశారు. సంపత్‌నగర్‌లోని భారతీ తీర్థ వేద స్మార్త పాఠశాలలోని 45 మంది వేద విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ. 1,116ల నగదు, ధావళి, ఆసనాలు, కొమ్ము చెంబు, పట్టు అంగవస్త్రాలు, పండ్లు పంపిణీ చేసి సత్కరించారు. వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ యనమండ్రి సురేష్ మాట్లాడుతూ వేద పాఠశాలలను ప్రోత్సహించడానికి పురస్కారాలు కార్యక్రమాలు నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. వేదాలు భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సత్రం కన్వీనర్ సుభద్ర, ప్రయాగ కృష్ణ, డి.కృష్ణ, ఎన్.వి.కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

నలుగురు హెచ్‌సీలకు ఏఎస్ఐలుగా ఉద్యోగోన్నతి



నగరంపాలెం: జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో (పీఎస్) హెడ్‌కానిస్టేబుల్(హెచ్‌సీ)గా విధులు నిర్వహిస్తున్న నలుగురికి ఏఎస్ఐలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ మేరకు నలుగురు ఏఎస్ఐలు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఎస్పీ చొరవతో ఉద్యోగోన్నతి కల్పించడంపై ఏఎస్ఐలు సంతోషం వ్యక్తం చేశారు. మేడికొండూరు పీఎస్ హెచ్‌సీ శ్రీనివాసరాజు, లాలాపేట పీఎస్ హెచ్‌సీ ఎస్.కె.ఎం.భాష, అరండల్‌పేట పీఎస్ హెచ్‌సీ చంద్రమోహన్, తెనాలి రెండో పట్టణ పీఎస్ హెచ్‌సీ శ్రీనివాసరావులు ఎఎస్ఐలుగా ఉద్యోగోన్నతి పొందిన వారిలో ఉన్నారు.